ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ:20-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
- ❖ మహిళా సాధికారిత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.
- ❖ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దసరా మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు.
- ❖ రాష్ట్రంలో రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================

రాష్ట్రంలో 2047 నాటికి 50 శాతం పచ్చదనం ఉండేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పల్నాడు జిల్లా మాచర్లలో ఈరోజు జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న “స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్” కార్యక్రమాలు మహిళల ఆరోగ్య సంరక్షణకు ఎంతగానో దోహదపడుతున్నాయని విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నగరంలోని పలు ఆరోగ్య కేంద్రాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు

నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేసారు. అభ ఐడి రిజిస్ట్రేషన్ పరిశీలించి, స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు, గర్భిణుల సేవలు, ల్యాబ్ టెస్ట్‌లు, కేన్సర్, సికిల్ సెల్ అనీమియా, పోషణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

==============================

మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పలు వృత్తి నైపుణ్య శిక్షణలు ఇస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఎస్ఈటిఐ సౌజన్యంతో మహిళలకు 35 రోజుల పాటు వస్త్ర చిత్ర కళపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, మహిళా సాధికారతే లక్ష్యంగా రామచంద్రపురం నియోజకవర్గంలో ఇంటికో మహిళను పారిశ్రామికవేత్తలుగా తీర్చదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.

==============================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం తీసుకొచ్చిన పలు కార్యక్రమాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 120 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఆయన బాల్యానికి సంబంధించిన ఇతివృత్తంతో నిర్మించిన "చలో జీతే హై" లఘు చిత్రం దేశవ్యాప్తంగా పలు థియేటర్లలో ప్రదర్శించబడుతుంది. ఈ లఘు చిత్రానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈనెల 17న ప్రారంభమైన ఈ లఘు చిత్ర ప్రదర్శన 24వ తేదీ వరకు కొనసాగుతుంది. విశాఖ నగరంలోని ఈ చిత్రాన్ని వీక్షించిన రామకృష్ణ ఆకాశవాణితో మాట్లాడుతూ…

(వాయిస్ 30 సెకన్లు)

==============================

GST 2.0 సంస్కరణల పేరుతో వస్తు సేవల పన్ను (GST)పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. ఈ నెల 22 నుండి కేవలం 5, 18 శాతంతో రెండు స్లాబ్ లను మాత్రమే కొనసాగించడంపై వినియోగదారులతో పాటు, వ్యాపారస్తులు, వివిధ కంపెనీల ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుడి కొనుగోలు శక్తిని పెంచడంతో పాటు, వ్యాపారస్తులకు ప్రయోజనకరంగా ఉంటాయని విశాఖకు చెందిన వ్యాపారి ప్రకాష్ తెలిపారు.

==============================

విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్ టి ఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈరోజు విజయవాడలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ… ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే ఈ ఉత్సవాలలో సుమారు 20 లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశముందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. మూలానక్షత్రం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు.

==============================

మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ, ఉత్తర అంతర కర్ణాటక మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు సముద్ర మట్టానికి ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

==============================

==============================